# శివోహమ్

ఎంత, మారిపోయినాడు...ఎంతలో,

దసరా వేడుకలు చూడడానికి మైసూరు వెళ్ళినప్పుడు తలవని తలపుగా కలుసుకున్నాము..... చదువు చాలించిన అయిదు సంవత్సరాలకి, చాలా సరదాగా హుషారుగా కాలము గడిపాము. గోష్ఠిలో, ఏదో సందర్భాన.... విశ్వకళాపరిషత్తు వారి నియోగాన, అలంకార శాస్త్రంలో పరిశోధనలు చేస్తూ, మదరాసులో ఉంటున్నాననీ.... ఒకటి రెండు కొత్త నాటకాలు ఆ మధ్యనే వ్రాశాననీ, చెప్పాడు–

ఇంకా పెండ్లి చేసుకోలేదు: కమ్ముకుని, కుందదీసి సాయత్తం చేసుకునే ఇతర బాధ్యతలు ఏమీలేవు. రసానంద జీవన పథాన మెయిల్ స్పీడున పరుగెత్తుతూన్న, అతనితో కలిపి అడుగువేయడానికీ,... ఆ పండుగ రోజుల్లో కూడా... నాకు ఓ మాదిరిగా దుర్ఘటమైంది: యోగినుల వీర విహారచ్ఛాయలు తరళితమౌతూ వచ్చినది. ఆ విలాస విశ్వాసాలలో, – ఇప్పటికీ, ఎప్పుడూ జ్ఞాపకం వస్తూంటుంది... ఇక, ఆ మరునాడు, బయలుదేరుతామనగా... సాయంకాలము నుంచే ఆయత్తమై, వెన్నెలబాగా కమ్ముకున్న తరువాత... చామరాజు పురంలో,... ఓ గుమ్మం ఎక్కాము. నునుసిగ్గును, బహు అందంగా అభినయిస్తూ, పైట పై అంచుకు, చుబుకం అనుకునేటట్టు రవల జిగినీ మీదుగా తలవంచుకుని, మరో ప్రౌఢ వెంటవచ్చి, వయ్యారంగా ఒదిగి నిలుచున్న, ఆ పిల్లను, మా వాడు, కన్నెషర్ దర్జాతో చూసి, బెదురు లేకుండా, తెలుగులోనే... 'తయారుకు వచ్చిన నాజూక్ బదన్' అనేశాడు. 'మాల్ గోవా... కాదూ?' అన్నాను. నేను నవ్వుతూ 'జాతిమంచిదే కాని,... అంత తీపి, మన తత్త్వానికి పడదోయ్' అని జవాబు చెప్పాడు, కొంటెగా ఆమె వంక చూస్తూ... మా నవ్వుతో శ్రుతి కలిపి, ఆ అమ్మాయికూడా, పెదవుల మీద ఒలికిపోతున్న చిరునవ్వుతో... తివాసీమీద కూర్చుని, వీణె అందుకుని... ఒక్క మెలకువలోనే శృతులు అమరించుకొని....

'చామ భూపాల నే నీమమతలు – విన... కోప మెటుల – రాకయుండును రా.... కోమలాంగ... నీపై....' అని, పలికించి, పలికి... పట్టలేక, కిలకిల నవ్వుతూ... 'నాకు తెలుగు తెలియదనుకున్నారేం?' అన్నది. 'మతాబా కాల్చామోయ్' అన్నాను రహస్యంగా. ఫరవాలేదని... ఇక మాట్లాడ వద్దనీ... చేతితో, చేతికి నొక్కి... చెప్పి.... ఆమె సరసకు చేరి, మీద చెయి వేసి –

'మరి... ఈ... భూపాలుడు.... నీకు కోపం వచ్చే పనులేమీ చేయడు.... నమ్మవూ.... ఇదిగో, చేతిలో చేయి.... 'కాదన్నను నీదుమోవి అధరామృతమాని"... ఏం? అని మాటలతోనే గిలిగింతలు పెట్టాడు... తలకొంచెం ఎత్తి, అరవిరిసిన కనుదమ్ములలోంచి... ఆహ్వానం... తొణికిస్తూ.... సరసంగా.... అతి... మధురంగా....

'చాల్లెండి... మీ మాటలు' అని చెంపమీదికి చేయి విసిరింది చటుకున: ఏలా ఒడిసాడో... అతని ఒళ్ళో వాలి, ఒక చేయి మెడమీదుగా ఉండిపోయింది. ఇక అక్కడ ఉండటం ఏలా? రావణాంతఃపురంలో నుంచి బయటపడే మారుతిలాగా బయటకు గెంతబోతున్నాను–

'ఇదుగోనోయ్...ఇందనీ' అని పర్సు నా వైపునకు విసిరాడు. ఎందుకూ... నీకు అవసరం... లేదూ? అన్నాను ఆంగ్లంలో మా ప్రబుద్ధుడు నవ్వుతూ,

'నామనసే ఇచ్చేశాను... పర్స్ ఎందుకోయ్... ఇక, దేవరవారువేంచేయవచ్చును.... సభ్యులు కాలవిలంబనమున కోర్వరు...కాదా...చెలీ'....ఆ పైన వినకుండానే బయటికి వచ్చాను నవ్వులో....

శృంగార – అతిథిని కావని అమాయికంగా తప్పించుకుని, అర్ధరూప సత్కారం మాత్రం ఉభయుల తరపునా చేసి, వెన్నెలలో.... నిద్రపోయినాను; వింతగా చూస్తూ నిలువబడిపోయిన మిగతా గంధర్వాంగనల ఆశ్చర్యాన్ని లక్ష్యం చేయని వాడిలాగ... అర్థం చేసుకొని – చేసుకోలేని, అమాయకుడి పోజుతో:

తీరికగా, కాఫీ అవశిష్టం అక్కడనే తీర్చుకుని, బయలుదేరేటప్పటికి, ప్రొద్దెక్కింది.... నాయకుడు దీర్ఘప్రవాసగతుడు కావడానికి ఉద్యుక్తుడయ్యే అవసరాన, స్వాధీన పతిక అయిన అనుకూల వేసే అనురాగపు పేచీలన్నీ ఆ నవమోహనాంగి మా వాడిమీద సాభినయంగా ప్రయోగించింది. నాయకుడు కూడా, ఈ విషయాల్లో అరితేరిన చేయి గనుక, ఆ ప్రదర్శనం చాలా అద్భుతంగా, బహు 'జయప్రదంగా' సాగిపోయింది. వదల లేక.... వదల లేక, ఒకరి కౌగిలి ఒకరు తప్పించుకుని, విడిపోయేటప్పటికి, కృత్యాద్యవస్థ అయింది.

'రంగ... అబ్బ ఎంత బాగుందోయ్' అన్నాడు అడుగుసాగిస్తూ: అర్థంలేని జవాబు కిందనేను, అతని వైపు శూన్యంగా చూసి, తల ఊగించాను.

'వదిలి రాలేక పోయినాను'

'పోనీ, ఉండి పోరాదూ'

'మరి, మదరాసుమాట'

'అయితే బయలుదేరతియ్యి'

బిగ్గరగా నవ్వుతూ, పరిహాసంగా, 'ఈ విషయాలలో... ఇంకా అర్భకుడవేనోయ్ నీవు' అన్నాడు.

ఏం?

'ఈ అమ్మాయిని... మళ్ళీ చూస్తానో, చూడనో'

'అదేమిటి...నీ మాటలు అర్థం కావడం లేదు'

'భాయీ! మోజు మిగుల్చుకుంటేనేగాని ఈలాటి సందర్భాల్లో మజాలేదోయ్. ఈ అభినయ రూపకానికి సరి అయిన భరతవాక్యం ఇదే. ఈ సంగతి ఆ అమ్మాయికీ తెలుసు. అదీగాక, వారాంగన విషయంలో ఏకపత్నీ వ్రతానుష్ఠానం చేయమంటావేం... జైత్రయాత్రకు బయలుదేరాం... ఇదో ఘట్టం..... ఇక... కాలోహ్యయం నిరవధిర్విపులాచ పృథ్వీ... ఇక్కడితో తృప్తిపడితే, మన రసిక జీవనంలో పెద్ద హంసపాదే...' అని విపులంగా వ్యాఖ్యానం చేశాడు.

'మహానుభావుడవు!'

'అవును, అనుభవంకోసం కాకపోతే అడుగు ముందుకు వేయవలసిన అగత్యం ఏమున్నదీ?' – అర్థమయింది. ఆ సిద్ధాంతాలకి సద్వినియోగం ఆచరణ రూపాన, చేయడానికి, అతనికి ఏలాటి అభ్యంతరము లేదని కూడా ప్రత్యక్షంగా అనుభవించగలిగాను, సాహచర్య భాగ్యానీ....

తరువాత... ఎవరి దోవను వారు, విడిపోయినాం: కాని, అనుక్షణమూ, ఏదో అవకాశాన, ఎందుకో, అతని లీలలూ, సిద్ధాంతాలూ, జ్ఞాపకం వస్తూ... అతన్ని జ్ఞాపకం చేస్తూనే వచ్చినవి. నేను మరిచిపోవాలనుకోలేదు కూడాను:

– ఆచారం మార్చకుండా, డిశంబరులో, ప్రతి సంవత్సరమూలాగా, మదరాసు వెళ్ళాను.

రెండు రోజులు, అక్కడ తారసిల్లిన స్నేహితులందరితో కలిసి గోష్ఠి చేయడంలో... కొత్త "సినీమాలు" చూడటంతో గడచిపోయినవి, తీరిక లేకుండానే మూడోనాడు యూనివర్సిటీ లైబ్రరీకి వెళ్ళే ప్రయత్నాన, చాలా త్వరగా బయల్దేరి, పూర్వరంగ నిర్వహణానికి...హోటలుకు వెళ్ళాను... అక్కడ... కనబడ్డాడు... మా వాడు!

నా ప్రక్కనే కూర్చున్నాడు కాని, భావనా లీనుడిని కావడంచేత మొదట గమనించలేదు: అతడు పలుకరించనూ లేదు... పంచదార తక్కువై... కేక వేయడానికి మెదిలేటప్పటికి... కనబడ్డాడు... తల వంచుకుని, తన ధోరణిలో... తాను...

– ఎంత మారిపోయినాడో...ఎంతలో...

వెనుకటి రూపే లేదు... ఆ కళా, ఉత్సాహమూ, లేశమూ, ఛాయారూపాన అయినా కనబడలేదు: ఆతడు అవునో కాదో అని నాదానించి, అనుమానిస్తూనే....

కుమారస్వామీ! అని సంకోచంతో... పలుకరించాను... నావంక తల ఎత్తి చూసిన తరువాత, అతడేనని, పోల్చుకోగలిగాను.

మాటాడలేదు... ఏమీ జవాబు చెప్పలేదు. లేచి అతని వెంట బయలుదేరి, బయటికి వచ్చాను. మలుపు తిరిగి, వెంకటరంగం పిళ్ళె వీధి వెంబడి... కార్‌స్ట్రీట్ మొదలకు చేరాము.

'ఏమిటోయ్... విశేషాలు?' ఇక, ఉండలేక, సంభాషణలోకి దింపుదామని... పలుకరించాను. స్వామి, మౌనముద్రాంకితుడుగానే ఉన్నాడు....

'ఏం... అలా ఉన్నావు' అని... కొంచెం ఆగి, మరికొంత దూరం పోయిన తరువాత, మళ్ళీ అందుకున్నాను. మావాడు, నావంక తేరిపారచూసి.... నిశ్చలంగా... 'బ్రతకాలని... యిష్టంలేక' అన్నాడు....

– కలవరపడి పోయినాను... ఏమనాలో తెలిసింది కాదు. పార్థసారధి మండపంలో, వచ్చి కూర్చున్నాము. ఒకమారు, కలయజూచి, తటాలున లేచి.... 'ఇక్కడ వద్దు.. వెళదాము, రా' అని, కదిలాడు. పోయి, రథం పక్కన జేరుకున్నాము... సిగరెట్లు... అంటుకున్నవి... తాపీగా పొగ ఊదుతూ.... ఏదో ఆలోచించుకుంటూ, ఉన్నాడు. అతడు....

'ఏమిటి... నాతో... చెప్పవూ?' అని జాలితో, వాత్సల్యంతో అడిగాను, దీనంగా, భుజంమీద చేయి వేసి:

నీళ్ళు కమ్మిన కళ్ళతో, నావంక చూసి, గాద్గదికం ఉట్టిపడుతూండగా... 'యాం చింతయామి సతతం. ...మయి...సా...వి-ర-క్తా' అన్నాడు... నాకు నవ్వూ, కోపమూ వచ్చినవి... ఇందుకా, ఇదంతా.... 'అయితే...'

'నాకు తెలుసులే... నీ ఊహ... భవభూతి పద్యపాదం పని అయిపోయింది! నాకు, ఇప్పుడు... ఇక, కావలసింది... ఆ ఒక్క అమ్మాయే....'

'మతం మార్చుకున్నావన్నమాట'

'ఆ...పిల్లను చూసి... తరువాత మాట్లాడు....'

"అంత... అందంగా ఉంటుందా?"

'మనకు, అందనప్పుడు....'

'ఫరవాలేదులే... కథ ఏమిటి... సెలవియ్యి'

'ఏం... నీవు కథగా వ్రాసుకుందామనా?'

'కాదోయ్... విని... సలహా చెప్పుదామని... చేతనైన....'

'చెప్పుతాను, కాని... ఒక ఒట్టు పెడతాను... యిష్టమేనా?'

'ఊం'

ఈ విషయంలో నీవు ఏమీ జోక్యం కలిగించుకోకూడదు... సరేనా....

'చెడగొడతాననా భయం'

'అదేమీ కాదు.... ఒప్పుకుంటేనే కాని... ఇక మాటాడను.'

'అలాగే...'

'అంతేకాదు... మాటమీద నిలవాలి'

'నమ్మకం లేదూ... పోనీ...'

'ఎబ్బె... అన్యధా భావించవద్దు.... నా ఆందోళన... అంతా విన్న తరువాత... నీకే అర్థమవుతుంది.'

ఔనని తల ఊపి, సావధానుణ్ణయినాను:

'అక్కడే... ఇందాక, మనం కూర్చున్నామే... అక్కడే ఆ అమ్మాయిని, మొదట చూసింది... చూడగానే మనసు నిలపలేక పోయింది.'

'జరీ కొలుకుల ఉప్పాడ చీరె చెరగు చిరు గాలికి రెపరెప లాడగానే... పరవశుణ్ణి అయిపోయినాను.... తలమీద జాజిదండ, ఎంత అందంగా అమర్చుకుందని?... అబ్బ! ఎంత నాజూకుగా ఉందోయ్'

'రాక గమనిస్తూనే, ముందు, దూకుడుగా, జనాన్ని కుమ్ముకుంటూ, నడచిపోయి, ఆవరణలో, కాచుకున్నాను. నా పక్కనుంచే, రాచుకుంటూ లోపలికి వెళ్ళింది... ముఖం అప్పుడు చూశాను... ఎంత బాగుంది!'

అనుసరించి తిరిగాను, ఆ ఒత్తిడిలో ఎక్కడ మాటపడి పోతుందోఅని: బయటికి వచ్చిన తరువాత... ఇంకో జట్కాలో ఎక్కి... ఇల్లు కనుక్కునేందుకు వెంట వెళ్ళాను... 'ప్రతిరోజూ....ఆమె కనబడుతుందేమోనని... చూళ్ళై పోస్టాఫీసు ప్రాంతాల, వాళ్ళ మేడ ముందర.... ఎన్నిసార్లు తిరిగానో....'

మళ్ళావారం దాకా, ఆమె దర్శనమే కాలేదు... ఇక్కడికే వచ్చింది... ఇక మనసు పట్టలేక, ఎదుట బడి... ఆమె ఏమనుకుంటుందో అని కూడా ఆలోచించకుండా,

సాభిప్రాయంగా చూశాను... కాని జవాబు రాలేదు... నా విషయంలో ప్రసన్నురాలు కాలేదు....

'అంతటితో ఊరుకోలేదు. ఆమె చూడనప్పుడు ఒకటి రెండుసార్లు మీద చెయి వేశాను... ఈ... దీనుడు... ఈ జన్మకు అంత వరకే నేమో.... నోచుకున్నది....'

ఆపలేక... వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టినాడు... నేను, ఏమీ అనలేదు... అప్పుడు కదిలించడం మంచిది కాదని. తన్ను తానే సముదాయించుకుని....

'ఇక చెప్పలేనోయ్.... బాధగా వుంది' అని కళ్ళు మూసుకున్నాడు.... మళ్ళా నీళ్ళు కమ్మడం... నాకంట బడటం యిష్టం లేక –

'ఈలా అధీరుడవయితే ప్రయోజనం ఏముందీ... కార్యభారం, నా మీద వేయరాదూ... సాయంత్రం వాళ్ళ యింటికి వెళుదామా? అని ధైర్యంగా అడిగాను...'

'లాభం లేదు'

'ఏమీ'

'గొప్పయింటి పడుచు....'

'అయితే మాత్రం?'

'ఎందుకు నాచేత అనిపిస్తావూ... నేను వెళ్ళి వచ్చాను, ఇదివరకు....'.

'కలుసుకున్నావా?'

– ఔనని తల ఊగించాడు. ఇనుమడించే నిరుత్సాహంతో, నేను....

మాట్లాడావా?

'ఆఁ'

'ఏమన్నది...'

'. . . . . . . . . . . .'

'చెప్పవూ?'

'అసంభవం... నన్ను ఆదరించ నన్నది... అనరాని మాటలన్నది... ఎంతోనికృష్టంగా చూసింది....'

'ఏలాగైనా లోబరుచుకొనలేవూ?'

'ఊహూ'

'కారణం'

'ఇంకొకరిని.... ప్రేమించింది....'

'అంతేనా... ఆ అడ్డు తొలగిస్తే....'

'వద్దు.... ఎన్నటికీ.... నాది కాదు.... ఆమెనైనా సుఖంగా ఉండనీ....'

'నిన్ను ఈలా చేసికూడానా....'

'పాపం ఆ అమ్మాయి ఏం చేసిందోయ్... ఆమె దోషం ఏమున్నదీ... ఈ అభాగ్యుడు ఆ అనర్ఘమణికి అర్హుడు కాడన్న మాట... నన్ను... ఎందుకు ప్రేమించాలి?'

'ఉత్తమమైన నీ ప్రేమను... ఎందుకు నిరసించాలేం?'

'అంగీకరించడమే కాకుండా... రెండో పక్షం కూడా ఉండకూడదూ....'

'పోనీ... వాడు... ఎవరు?'

'ఎవరైతేనేం?... ధన్యుడు... ధన్యతముడు...'

'ఏలా నిర్ణయించడం....'

'ఆ అమ్మాయి మనస్సే... ప్రేమే... ... ప్రమాణం...'

ఆ, ధోరణి అతివేల మవుతూన్నది.... మాట మార్చడానికని, 'ఎండ ఎక్కిందిం... ఇక కదులుదామా? అంటూ లేచాను. 'మంచిది.... నీవు వెళ్ళు' అన్నాడు కదలకుండా... నేనూ, బదులు చెప్పకుండా మళ్ళీ కూర్చున్నాను....'

'అనంతరం.... ఆచరణీయం ఏమిటి?'

'శైవుణ్ణి అయిపోతాను.'

'పోయి...'

'హిమవంతుణ్ణి ఆశ్రయించి... హృదయం కరడు గట్టించుకుంటాను... ఈ దాక్షిణ్యత సంపర్కం... ఇక సహించలేను... శివుడికి తాపోపశమనం చేసిన నగరాజమే, నాకూ శరణ్యం....'

'అదేమిటోయ్... ఎవరో ఓ వైష్ణవ వధూటి నిన్ను గికురించిందని... నిర్వేదంతో అస్త్రసన్యాసం చేయడమా... విజృంభించి... వీరవిహారం చేయడమా.... ధీరుడికి ఉచితమైన పని....'

'ఇక ఆ ప్రమేయం వద్దు. మన్మథుడు మన మీద ఇంత దుండగీతనం చేసినప్పుడు.... ఇంకా వాడినే ఉపాసించ మన్నావా... ఈ దెబ్బతో... రతికి నిత్యవైధవ్య ప్రాప్తి... మనసులో మొలకెత్తడం కాదు... కలలోనైనా ఎవరికీ కనపడకుండా... చేస్తాను... ఇదిగో... నా హృదయంలో బంధించాను ఆ పుండాకోరుని... లాక్కువెళ్ళి... మంచులో... లోతుగా స్థాపించి... ప్రమద గణాన్ని చుట్టూ కాపు పెడతాను... తల ఎత్తాడా... త్రిశూలాల బారు దిగి పోతుంది... అదుగో... కదలుతున్నాడు.... ఉండు, ఇకపోతుంది... అదుగో.... కదలుతున్నాడు. ఉండు, ఇక నీ పని చెబుతా...'

నావంక చూడలేదు... నాతో మాటాడలేదు. నేను ఉన్నాననే స్పృహ ఉన్నట్టు తోచదు... లేచి... పరుగెత్తుకు... వెళ్ళి పోయినాడు... ఎక్కడికి?

ఏమో... తరువాత, ఏమైనాడో... ఎవరికీ తెలియదు.

* * *